

కష్టపడ్డారు.. సాధించారు

- నలుగురు ఆడపిల్లలు ప్రభుత్వ ఉద్యోగస్తులే
- ఆనందంలో తల్లిదండ్రులు


నలుగురు కుమార్తెలతో గోపాలం, వెంకటమ్మ

మక్తల్: పట్టుదల ఉంటే నిత్య జీవితంలో ఏదైన సాధించగలమని నిరూపించారు ఆ ఆడబిడ్డలు. తమ కాళ్లపై నిలబడేందుకు పట్టుదలతో చదివి నలుగురు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించారు. మక్తల్ పట్టణంలో ఎల్లమ్మ కుంటలో విశ్రాంత పీఈటీ గోపాలం, వెంకటమ్మలకు నలుగురు కూమార్తె రూప, దీప, శిల్ప, పుష్ప ఉన్నారు. వారికి మగ సంతానంలేదు. ప్రస్తుతం అందరికీ పెళ్లిలు అయ్యాయి. తమ కూమార్తెలు అందరూ ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి తమ కాళ్లపై నిలబడాలని ఆ తల్లిదండ్రులు ఆశించారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి అందరినీ ప్రభుత్వం ఉద్యోగం సాధించేలా చేశారు. నలుగురు కుమార్తెలు జీవితంలో స్థిరపడటంతో వారి ఆనందానికి అవధుల లేకుండా పోయింది. పెద్ద కుమార్తె బి.రూప, పీఈటీగా 2009లో, రెండో కుమార్తె దీప ఎస్జీటీ– 2012, మూడో కుమార్తె శిల్ప వెటర్నరీ అసిస్టెంట్‌గా– 2017, నాల్గవ కుమార్తె బి.పుష్ప పీఈటీగా 2020లో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. జీవితంలో కష్ట పడితే ఏమైనా సాధించగలమని ఆ ఆడపిల్లలు నిరూపించారు.

అదృష్టం వరించింది..

నా నలుగురు కుమార్తెలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాను. మంచి ఫలితాలు సాధించి అందరూ ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. అందరికీ ఉద్యోగాలు రావడం ఎంతో ఆనందంగా ఉంది. నాపిల్లలే కాకుండ తాను పని చేస్తున్న పాఠశాలలో 21 మంది విద్యార్థులకు పీఈటీ ఉద్యోగాలు వచ్చాయి.

– బి. గోపాలం,
విశ్రాంతి పీఈటీ, మక్తల్

క్లుప్తంగా

సోమ, గురువారాల్లో రెవెన్యూ మేళా

నారాయణపేట: జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లింపులు, రివిజన్ పిటిషన్ సహా ఇతర సమస్యల పరిష్కారానికి సోమవారం, గురువారాల్లో రెవెన్యూ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ మేళా ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లింపులు, ఇతర సమస్యలకు పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ మేళా ద్వారా ప్రజలు ఎవరైనా రివిజన్ పిటిషన్ ఉంటే పరిష్కరించుకోవచ్చన్నారు. సోమ, గురువారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్లు సిబ్బంది అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కృష్ణా: మండల పరిధిలోని కున్సి ఉన్నత పాఠశాలలోని 40 మంది పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి స్వామినాథ్ సొంత ఖర్చులతో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సంతోషి మాట్లాడుతూ మంచి మనసుతో కార్యదర్శి సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, నర్సిములు, భారతి, సుశ్మిత, రాము, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ధన్వాడ: మండలంలోని పాతపల్లి గ్రామంలో శుక్రవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీఓ సాయిప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్జీఎస్ నిధుల నుంచి రూ.22 లక్షలతో పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ మాధవరెడ్డి, కృష్ణయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లీకేజీ పనులు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం చౌరస్తాలో నారాయణపేట పట్టణానికి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు శుక్రవారం ఉదయం చేపట్టారు. గత సంవత్సరం డిసెంబర్ చివరి వారంలో ఇదేచోట లీకేజీ ఏర్పడి వారం రోజుల పాటు జిల్లా కేంద్రానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మూడు నెలల లోపే మళ్లీ తాజాగా అక్కడే లీకేజీ ఏర్పడడంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌వేటర్ సహాయంతో మరమ్మతు పనులను చేపట్టారు. మధ్యాహ్నం మున్సిపల్ కమిషనర్‌తో పలువురు అధికారులు పనులు చేపట్టారు.

డ్రంక్అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలుశిక్ష

దామరగిద్ద: డ్రంకెన్ డ్రైవ్ కేసులో నిందుతుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. గతేడాది నవంబర్ 21న వాహన తనిఖీలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో కాన్‌కుర్తికి చెందిన మ్యాథరి రాజు తాగి వాహనాన్ని నడిపినట్లు రుజువైందన్నారు. రెండు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మద్దూరు: గుట్టు చప్పుడు కాకుండా కొత్తపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. కొత్తపల్లి గ్రామానికి చెందిన గుట్టపల్లి పర్వతరెడ్డి, వింజమూరు నారాయణరెడ్డి, కిషన్‌నగర్ సత్తిరెడ్డి, నీలి శ్రీనివాస్, గవినోల్ల సతీష్‌కుమార్ రెడ్డి, మద్దూరు వెంకట్‌రెడ్డి, ఎగునూరు జైపాల్‌రెడ్డిలను పట్టుకుని వారి వద్ద రూ.45 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సమాజంలో మహిళల పాత్ర వెలకట్టలేనిది


మక్తల్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను సన్మానం చేస్తున్న అధికారులు

నారాయణపేట ఎడ్యుకేషన్/ మక్తల్/మద్దూరు/ కోస్గి రూరల్/దామరగిద్ద/నారాయణపేట రూరల్ : విద్యారంగం, సమాజంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని డీఈఓ గోవింద రాజులు అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణ గోకులం హైస్కూల్‌లో జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల మహిళా ప్రధానోపాధ్యాయులకు, కేజీబీవీ ఎస్ఓలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. బాలికలు చక్కగా చదువుకునే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని కోరారు.కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరసింహా రెడ్డి, ఏఎంఓ విద్యాసాగర్, ఏసీజీఓ ఆంజనేయులు, డీఎస్ఓ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

జిల్లా కేంద్రంలోని స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్త్రీ అభివృద్ధితోనే సమాజాభివృద్ధితోనే సాధ్యమని అధ్యాపకులు సూచించారు.

- మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులను శాలువా, మెమొంటోతో సన్మానం చేశారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమలు ప్రదానం చేశారు.
- మద్దూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావ్‌ఫూలే, సరోజినాయుడు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.
- కోస్గి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో గుండుమాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.
- నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ, జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా టీచర్లు, సిబ్బందిని శాలువా, పూలమాలలతో సన్మానించారు.
- మహిళలు ఆర్థిక స్వావలంబనతో అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌బీఐ మేనేజర్ జైపాల్ అన్నారు. దామరగిద్దలో ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.


కార్యక్రమంలో వేదికపై కూర్చున్న ఉపాధ్యాయులు


మద్దూరు డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవంలో ఉపన్యాసకులు

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్ర సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో యూడీఐడీ, ఇందిరమ్మ ఇళ్లు, ఎల్ఆర్ఎస్, డీఎస్ఆర్, వీసీ పీసీ, సమ్మర్ యాక్షన్ ప్లాన్ అంశాలపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం పరంగా మెరుగైన సేవలను అందించాలన్నారు. మండల అధికారులు సైతం రోజూ గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యూడీఐడీ పోర్టల్‌పై గ్రామ సభల్లో అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాల్ సెంటర్ల నుంచి దరఖాస్తు దారులందరికీ ఫోన్ చేసి ఫీజు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. రోజూ వారీగా ఎల్ఆర్ఎస్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో సరిగ్గా లేవని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, డీఆర్డీఓ మొగులప్ప, డీపీఓ కృష్ణ, జెడ్పీ డిప్యూటీ సీఈవో జ్యోతి, డీడబ్ల్యూఓ జయ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి

ధన్వాడ: ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ధన్వాడ మండలంలోని కొండాపూర్ పీఎం శ్రీ గిరిజన గురుకుల అప్ గ్రేడెడ్ పాఠశాల, కళాశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి, పీఎంశ్రీ కింద జిల్లాలోనే ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ పాఠశాల ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ అన్నారు. విద్యార్థులందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ కళ్యాణి, ప్రిన్సిపాల్ రాజారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శనగలు క్వింటాల్‌కు రూ.5,850

నారాయణపేట: నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం శనగలు క్వింటాలుకు గరిష్ట, కనిష్టంగా రూ.5,850లకు వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. వివిధ పంటల ధరలను వ్యాపారస్తులు కోడ్ చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.

వ్యవసాయ మార్కెట్ యార్డులో ధరలు

సరుకు	బస్తాలు	క్వింటాలు	గరిష్టం	కనిష్టం
శనగలు	26	12.74	5,850	5,850
వేరుశనగ	46	13.80	6,070	4,140
జొన్నలు	372	182.28	4,350	3,360
వడ్లు సొన	5	3.00	2,190	2,190
కందులు ఎరట్రి	177	86.73	7,432	6,869
కందులు తెల్లవి	163	79.87	7,623	7,160



తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: నియోజకవర్గలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకుంటామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. మక్తల్, ఆత్మకూర్, అమరచింత మున్సిపాటీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడికి బోర్ల యజమానుల నుంచి నీరు సరఫరా చేయాలని లేని పక్షంలో ట్యాంకర్ల నుంచి సరఫరా చేయాలన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ నుంచి నీటి సరఫరా అందరికీ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యలపై తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గతంలో తాగునీటి కోసం రూ.50 లక్షల మంజూరు చేయించి గ్రామాల్లో బోర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్ఈ జగన్‌మోహన్, మార్కెట్ వైస్‌చైర్మన్ గణేష్‌కుమార్, ఈఈ రంగరావు, డీఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ రమేష్, ఏఈలు వెంకటేష్, శ్రీకాంత్, పకీరన్న, సాహితి, అంజనేయులు, శేషుకిరణ్, చెన్నయ్యసాగర్, నియోజకవర్గ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

మక్తల్ అభివృద్ధికి సహకరించాలి..

మక్తల్: పట్టణంలో పాత కూరగాయాల మార్కెట్ సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం స్థలాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరిశీలించారు. మక్తల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 30 ఏళ్ల అనంతరం పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు అయిందన్నారు. లక్షల రూపాయాలు ఆదాయం వస్తున్న కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం గత పాలకుల నిర్లక్ష్యమని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్‌వైస్ చైర్మన్ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు

మక్తల్: జిల్లా ఎస్పీ యోగేష్‌గౌతమ్‌ను మక్తల్ సీఐ రాంలాల్ శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మక్తల్ సీఐగా రాంలాల్ బాధ్యతలు చేపట్టిన అనంతరం కలిసినట్లు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

నారాయణ పేట టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పార్క్ ఎదురుగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్య గౌడ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వామపక్ష నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదా బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా శిబిరానికి వచ్చిన తహసీల్దార్ అమరేందర్‌కు పలు డిమాండ్లతో కూడిన మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సలీం పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 149 మంది గైర్హాజర్

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష జరగగా.. జిల్లాలోని 16 పరీక్ష కేంద్రాల్లో 149మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 4702 మంది విద్యార్థులకు గాను 4553 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 4095 మందికి గాను 3970 హాజరయ్యారు. 125 మంది గైర్హాజర్ అయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 607 మందికిగాను 583 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్‌రావ్ తెలిపారు.

వేసవిలో దాహం తీర్చడం మహాభాగ్యం

నారాయణపేట రూరల్: వేసవిలో ప్రజల దాహం తీర్చడం మహా భాగ్యమని నారాయణపేట రూరల్ ఎస్సై రాముడు అన్నారు. శుక్రవారం నారాయణపేట మండలం అప్పక్‌పల్లి బస్ స్టేజీ వద్ద దివంగత ఎల్లమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

సీఎం పదవి నీటిబుడగలా ఉంది


మాట్లాడుతున్న నాగురావు నామాజీ

మరికల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవి నీటి బుడగల ఉందని, దీంతో ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలు ఎలా పరిష్కరిస్తారని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘ కన్వీనర్ నాగురావు నామాజీ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు మొత్తం 420 వాగ్దానాలని విమర్శించారు. అధికారం కోసమే ప్రజలకు మోసపూరిత అబద్ధపు హామీలు ఇచ్చారన్నారు. తమ నేత కిషన్ రెడ్డిని నోటికి వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ప్రజల సంక్షేమాలకు ఉపయోగించకుండా పక్కదారి పట్టిస్తున్న ఘోరమైన ప్రభుత్వం ఇదేనన్నారు. ప్రభుత్వ పథకాలకు బీజేపీ ఎప్పుడు అడ్డు పడలేదని గుర్తు చేశారు. అందుకే రెండు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఉపాధ్యాయులు, పట్టభద్రులు గెలిపించారన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్, మండల అధ్యక్షులు వేణుగోపాల్, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం అడ్డంకి కాకూడదు

నారాయణపేట ఎడ్యుకేషన్: శారీరక వైకల్యం లక్ష్యానికి అడ్డంకిగా మారకూడదని జిల్లా అథ్లెటిక్ సెక్రెటరీ రమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో శుక్రవారం పారా అథ్లెటిక్ లింగప్పకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లింగప్ప జాతీయ స్థాయిలో 400 మీ., 1500 మీటర్ల పరుగు పందెంలో జిల్లా నుంచి పాల్గొనడం గర్వకారణన్నారు. ఏదైనా విజయం సాధించాలంటే బలమైనా సంకల్పం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా అథ్లెటిక్ కోచ్ హారిక దేవి, పీఈటీ అక్తర్ ఫాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

మక్తల్/మరికల్/దామరగిద్ద/ధన్వాడ/నారాయణపేట రూరల్: మక్తల్ మండలంలోని మాద్వార్ ఎంపీపీఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అనిల్‌గౌడ్, హెచ్ఎం వెంకట్‌రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- మరికల్ మండలంలోని జిన్నారం, తీలేర్, పస్పుల ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు.
- దామరగిద్ద మండలంలోని సీపీఎస్ పాఠశాలలో హెచ్ఎం చందుజమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
- ధన్వాడ మండల కేంద్రంలోని సాయి సరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.


జిన్నారంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

‘పేట’ కళాకారులను అభినందించిన రాష్ట్రపతి


పేట కళాకారుల ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్రపతి ముర్ము

నారాయణపేట రూరల్: ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న వైవిధ్య అమృత మహోత్సవ్ వేడుకల్లో నారాయణపేటకు చెందిన చేనేత కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతు.. దక్షిణ భారతదేశ కళలు, సంస్కృతి గురించి ప్రజలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 50 మంది చేతివృత్తులవారు, నేత కార్మికులు ఉత్సవాల్లో పాల్గొని సరికొత్త డిజైన్ల ద్వారా దేశం గర్వించదగ్గ కీర్తిని పొందుతున్నారని కొనియాడారు. అనంతరం నారాయణపేట జిల్లాకు చెందిన చేనేత డిజైనర్ ఘనశ్యామ్ సరోదే, కొండా కవితారెడ్డి, కొండా వెంకటేశ్వర్ రెడ్డి తమ ప్రత్యేకమైన చీరలను ప్రదర్శించడానికి ఎంపికచేసి టెక్స్‌టైల్ డిజైనింగ్ అద్భుతంగా రూపొందించినందుకు రాష్ట్రపతి తో పాటు పలువురు అధికారులు అభినందించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నారాయణపేట టౌన్: వీఆర్ఓ, వీఆర్ఏలను తిరిగి రెవెన్యు శాఖలో నియమించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆ శాఖ ఉద్యోగులు పట్టణ పుర పాలక కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గతంలో పలు మండలాల్లో వీఆర్ఏలుగా పనిచేసస్తున్న వారిని పదోన్నతులపై ఇతర శాఖలకు జూనియర్ అసిస్టెంట్లుగా గత ప్రభుత్వ బదిలీ చేసిన విషయం తెలిసిందే. తిరిగి అదే శాఖకు నియమిచడంపై పలువురు వార్డు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు అధికారులు రాజప్ప, భీమ్‌రావ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వార్డు ఆఫీసర్లు

ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలి

మక్తల్: పండుగలను ప్రతి ఒక్కరూ సోదర భావంతో జరుపుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పట్టణంలో కాలేజీరూట్ షరిఫా మజీద్ దగ్గర మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

మద్దూరు: రంజాన్‌ను పురస్కరించుకొని కొత్తపల్లి మండలంలోని దుప్పట్‌గట్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి మండల కేంద్రంలోని జామా మజీద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇమామ్‌లు ఖలీద్, మోజమ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు షేక్ అహ్మద్, చాంద్‌పాషా, హబీబ్, అతిక్, సలాం, సబ్బీర్, షఫీ, నూరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.